## ముగిసిన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు

**సంగారెడ్డి టౌన్, నవంబరు 13, ప్రభాతవార్త:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హన్మంతరావు ఆధ్వర్యంలో ఆదివారం సంగారెడ్డి జిల్లాలో హాక్ హమారాలీలో పైన, ప్రజలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాలను అక్టోబరు 31 నుంచి నవంబరు 13వ తేదీ వరకు నిర్వహించారు. కార్యక్రమాలు ముగింపును పురస్కరించుకుని శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ జహీరాబాద్, జోగిపేట,నారాయణఖేడ్ కోర్టుల లో, గ్రామాల్లో, జైలుఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమాల్లో భాగంగా 40 అవగాహన సదస్సులు నిర్వహించి 4500 మందిలబ్ధిదారులకు, ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. హాక్ హమారాలో భాగంగా 8 బృందాలతో 469 మంది ఖైదీల వివరాలు క్రోడీకరించి అబ్జర్వేషన్ హోమ్స్‌లలో సైతం వివరాలుతీసుకున్నామన్నారు. మెగా న్యాయసేవాధికార సంస్థ నవంబరు 5న ఇస్నాపూర్‌లోని మహేశ్వర మెడికల్ కళాశాలలో నిర్వహించినట్లు గుర్తు చేశారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె హన్మంతరావు, న్యాయవాదులు బాల్‌రెడ్డి, బుచయ్య, ఇంద్రసేనారెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## దోమడుగులో కార్డెన్ సెర్చ్... 135 వాహనాలు సీజ్

### అదుపులో 30 మంది అనుమానితులు : పటాన్‌చెరు డీఎస్పీ భీమ్‌రెడ్డి

**గుమ్మడిదల, నవంబర్ 13, ప్రభాతవార్త:** గుమ్మడిదల మండలంలోని దోమడుగు పంచాయతీ పరిధిలోని కమ్యూనిటీ కాంటాక్ట్ కార్డెన్ సర్చ్ కార్యక్రమం సుమారు 200 మంది పోలీస్ శాఖ ఉన్నత అధికారులతో ఆదివారం నిర్వహించడం జరిగింది. వివిధ రాష్ట్రాల కార్మికుల కుటుంబాలను వారి వాహనాల తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు డీఎస్పీ భీమ్‌రెడ్డి మాట్లాడుతూ తనిఖీలు భాగంగా 135 వాహనాలను సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. వివిధ రాష్ట్రాల వారు సుమారు 30 మందిని అనుమానితులుగా భావించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం అదుపులోకి తీసుకున్న వారిని వదిలిపెడతామని సూచించారు. ఈ తనిఖీ కేవలం ప్రజా క్షేత్రంలో పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని తెలియజేయడానికి ఈ తనిఖీలు నిర్వహించామని తెలిపారు. ఎస్ఐ విజయ కృష్ణతోపాటు వివిధ మండలాల పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో గ్రూప్ 4 ఉద్యోగాలకు నోటిఫికేషన్

### ఆర్థిక,ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

శిక్షణ తీసుకుంటున్న ప్రతి ఒక్కరూ ఉద్యోగం సాధించినప్పుడే ఒక ప్రజాప్రతినిధిగా నాకు నిజమైన ఆనందం లభిస్తుందని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని మల్టీ పర్పస్ హైస్కూల్‌లో పోలీస్ ఉద్యోగాల కోసం దేహదారుఢ్య పరీక్షల శిక్షణ తీసుకుంటున్న శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యువతను నిర్వీర్యం చేస్తూ అగ్నిపథ్ పేరిట కాం ట్రాక్టు విధానం తేవడం హేయమైన చర్యగా బిజెపి ప్రభుత్వతీరును విమర్శించారు. త్వరలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 4 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తుందన్నారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి 70 రోజులపాటు ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యో గార్థులకు సిద్ది పేట,గజ్వేల్ లో ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహించగా 1030 మంది దరఖాస్తు చేసు కున్నారని అందులో 580 మంది ఉత్తీర్ణత సాధిం చారని ఉత్తీర్ణతసాధించిన వారందరికి దేహదారుఢ్య పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామని, ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా కానిస్టేబుల్ ఉద్యోగాలకు 333 మంది అర్హత సాధించగా 199 మంది అభ్యర్థులు ఎస్ఐకి అర్హత ఆధించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 91 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, వాటిలో 95 శాతం స్థానిక రిజర్వేషన్లు అమలు చేయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిసిపి మహేందర్, ఏసిపి దేవారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, నర్సింగ్, కౌన్సిల్ సభ్యుడు పాల సాయిరాం, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు





చిన్నశంకరంపేటలో శిథిలావస్థకు చేరిన వినియోగదారుల సేవా భవనం

# శిథిలావస్థలో విద్యుత్ వినియోగదారుల కేంద్రం

**మెదక్, నవంబర్ 13, ప్రభాతవార్త:** విద్యుత్ బకాయిలను చెల్లించాలంటే వినియోగదారులు సేవా కేంద్రాలకు వెళ్లి చెల్లించాలి. కానీ చిన్నశంకరంపేట మండల కేంద్రలో ఉన్న విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్ర భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారుల కార్యకలాపాలు ప్రవేటు దుకాణాల ముందే విధులను నిర్వహిస్తున్నారు. భవనంపైన, గోడలలో పిచ్చి మొక్కలు మొలిచినా అధికారులు పట్టిపట్టనట్టు ఉండటం విశేషం. కొంత కాలం క్రితం ఈ భవనంలో ప్రాథమిక ఉప వైద్య కేంద్రం ఉండేది. తరువాత భవనం ఖాళీగా ఉండటంతో పట్టణ పాలకవర్గ సభ్యులు వినియోగదారుల సేవాకేంద్రంకు ఈ భవనాన్ని కేటాయిస్తున్నట్లు తీర్మానం చేసి విద్యుత్ శాఖకు అందించారు.

### ప్రైవేటు దుకాణాల ఎదుట ఉద్యోగుల కార్యకలాపాలు

**వినియోగదారులకు తప్పని అవస్తలు..**

ప్రస్తుత కాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలంటే సెల్‌ఫోన్ ఆధారంగా చెల్లింపులు చేస్తున్నారు. కానీ మారుమూల పల్లెటూరు ప్రజలు మాత్రం వాటిపై అవగాహన లేక, స్మార్ట్‌ఫోన్‌లు లేక విద్యుత్ అధికారులకే నేరుగా బిల్లులను చెల్లిస్తున్నారు. కార్యకలాపాలకు చోటు లేకపోవడంతో అధికారులు సైతం ఆరుబయటే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

**గడపగడపకు తిరిగి....**

వినియోగదారుల సేవా కేంద్రం లేకపోవడంతో విద్యుత్ శాఖ అధికారులు పట్టణంలోని ప్రజల ఇంటి వద్దకు వెళ్లి బిల్లులు వసూలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ, వాన అనే తేడా లేకుండా ఆరుబయటే కార్యకలాపాలు చేస్తున్నామని అధికారులు వాపోతున్నారు.

**ప్రతిపాదనలు పంపాం....**

**ఏఈ సతీష్ బాబు**

శిథిలావస్థకు చేరిన విద్యుత్ వినియోగదారుల సేవా భవనం మరమ్మత్తులకు 2లక్షల రుపాయలు అవసరం అని, ఉనత్న అధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు అయిన వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టి భవనాన్ని పున:నిర్మిస్తామని తెలిపారు.

## బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలాసీతారామన్

### టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనవాస్‌రావు, పద్మారావు

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 13 ప్రభాతవార్త:** జాతీయ పెన్షన్ పథకాన్ని అంగీకరించి అమలు జరుపుతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు బయటకు వచ్చే స్వేచ్ఛలేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించటాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫన) జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ప్రపంచ బ్యాంక్ షరతులకు లోబడి కార్పొరేట్ వ్యాపారుల షేర్‌మార్కెట్ వ్యాపారంలో ఫైనాన్స్ క్యాపిటల్‌గా పబ్లిక్ మనీని వినియోగించుకోవటానికే చందాతో కూడి పింఛన్ పథకాన్ని అమలు చేస్తున్నారని, వారి ప్రయోజనాలు కాపాడటానికే నిర్మలా సీతారామన్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనవాస్‌రావు, పద్మారావులు విమర్శించారు. ఆదివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2004లో బీజేపీ ప్రభుత్వం జాతీయ పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టగా అదనంతరం అధికారంలోకి వచ్చిన యూపీ ఏ ప్రభుత్వం దొడ్డిదారిన రాష్ట్రాల్లో ఎన్‌పీఎస్‌ను అమలు జరిపించిందని గుర్తు చేశారు. కుటుంబాల సామాజిక భద్రతపట్ల ఆందోళనచెందుతున్న సీపీఎస్ ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు దేశ వ్యాప్తంగా సీపీఎస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న క్రమంలో పాలక పక్షాలు రాజకీయ అస్థిత్వం కోసం ఉద్యోగుల డిమాండ్‌కు తలొంచక తప్పటం లేదన్నారు. ప్రజలకు చెందాల్సిన పెన్షన్ సొమ్మును ప్రభుత్వాలకు కాదని వ్యాఖ్యానించిన కేంద్ర ఆర్థిక మంత్రికి నిజంగా ప్రజలపై ప్రేమ ఉంటే పీఎఫ్‌ఆర్డీఏ చట్టాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని, జనరల్ ప్రావిడెంట్ ఫండ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కనీసం పాత పెన్షన్ విధానంలోకి మారడానికి రాష్ట్రాలకు స్వేచ్ఛను ఇచ్చేవిధంగా పీఎఫ్‌ఆర్డీఏ చట్టాన్ని సవరించాలని కోరారు. జాతీయ విద్యా విధానం, జాతీయ పింఛన్ పథకం రద్దు కోరుతూ ఎస్టీఎఫ్ఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న సంతకాల సేకరణలో రాష్ట్రంలోని ఉద్యోగులు,ఉపాధ్యాయులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కవిత, కోశాధికారి రవీందర్‌రెడ్డి, అజయ్‌కుమార్, భీమ్లానాయక్, ఫయాజుద్దీన్, శేఖర్, షాకీర్ అలీ, ప్రేమ్ కుమార్ తదతరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వంశీకృష్ణ

**అక్కన్నపేట, నవంబరు 13, ప్రభాతవార్త**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన కబడ్డి క్రీడాకారుడు పులికాశి వంశీకృష్ణ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డి పోటీలో సిద్దిపేటజిల్లా తరుపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపర్చిన సందర్భంగా ఆయనను జాతీయ క్రీడలతో పాటు తెలంగాణ రాష్ట్ర అసిస్టెంట్ కోచ్‌గా ,జిల్లా కబడ్డి అసోసియోషన్ ప్రధాన కార్యదర్శిగా ఆదివారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన శివ కుమార్‌కు కబడ్డి అసోసియోషన్ జిల్లా ఉపాధ్యక్షుడు,చౌటపల్లి సర్పంచ్ గద్దల రమేష్ హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కబడ్డి అంతర్జాతీయ క్రీడాకారుడు గంగాదరి మల్లేష్,తిగుల్ల పోచయ్య, సంపత్, రమేష్, రవి, యాదగిరి, తదితరులు ఉన్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**మెదక్, నవంబర్ 13, ప్రభాతవార్త:** నేడు(సోమవారం) చిన్నశంకరంపేట మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీవో గణేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశంకు మండల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

## జాతీయ సేవారత్న అవార్డు అందుకున్న శ్రీనివాస్

**నర్సాపూర్, నవంబర్ 13, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణంలోని కోర్టులో మండల్ లీగల్ సర్వీసెస్‌లో ఔట్ సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్న ఏర్పుల శ్రీనివాస్ ఆదివారం జాతీయ సేవారత్న అవార్డును అందుకున్నారు. ఆదివారం దేశరాజధాని న్యూఢిల్లీలో బహుజన సాహిత్య అకాడమీ అంతర్జాతీయ సమావేశంలో బహుజన సాహిత్య అకాడమీ అంతర్జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ, కర్ణాటక రాజ్యసభ సభ్యులు హనుమంతరావు చేతుల మీదుగా ఈ జాతీయ సేవారత్న అవార్డును ఏర్పుల శ్రీనివాస్ అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.అంబెద్కర్ వాదిగా అనేక దళిత ఉద్యమాలకు శ్రీకారం చుడుతూ సమాజ మార్పు కోసం నిరంతరం పోరాటం చేస్తున్న దళిత ఉద్యమ నాయకుడిగా గతంలో మొట్టమొదటిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డు, ఉత్తమ జాతీయ యువజన నాయకుడు అవార్డు, అంబెద్కర్ జాతీయ అవార్డులు పొందడం జరిగిందన్నారు. ఈమేరకు ప్రస్తుతం జాతీయ సేవారత్న అవార్డు రావడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.



జాతీయ సేవా రత్న అవార్డును అందుకుంటున్న ఏర్పుల శ్రీనివాస్

## ఈటల రాజేందర్‌ను సన్మానించిన మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్

**నర్సాపూర్, నవంబర్ 13, ప్రభాతవార్త:** హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, బిజెపి నాయకులు మురళీయాదవ్ మార్యద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు బొకెలు ఇచ్చి శాలూవాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలపై చర్చించడం జరిగింది. ఈటల రాజేందర్‌ను కలిసిన వారిలో బిజెపి మెదక్ పార్లమెంటరీ కన్వీనర్, మాజీ వైస్ ఎంపిపి తూప్రాన్ రామ్మోహన్‌గౌడ్, ఇతర ముఖ్య నాయకులు ఎమ్మెల్యే ఈటెల రాజెందర్ ను కలిసిన వారిలో ఉన్నారు.



రాజేందర్‌ను సన్మానిస్తున్న మున్సిఫల్ చైర్మన్ మురళీయాదవ్ తదితరులు

# ఘనంగా కొండ పోచమ్మ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

**జగదేవపూర్, నవంబర్ 13,(ప్రభాతవార్త):** తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కొండ పోచమ్మ అమ్మవారి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా జగదేవపూర్ మండలం చాట్లపల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ జిల్లా నాయకులు అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో అమ్మవారికి బైండ్,ఒగ్గు వారి పాటలతో పటము నిర్వహించగా పటములో జోగిని శ్యామల శిగమెత్తి నృత్యాలు చేస్తూ డప్పు చప్పులతో అమ్మవారికి ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా అశోక్‌యాదవ్ మాట్లాడుతూ తమ స్వంత ఖర్చులతో కొండ పోచమ్మ అమ్మవారికి ప్రతి ఏటా బోనం ఎత్తడం అనవాయితీగా వస్తుందని అన్నారు.



కొండ పోచమ్మ వద్ద బోనం ఎత్తిన జోగిన శ్యామల

వార్షికోత్సవంలో ఆకర్షణంగా అశోక్‌యాదవ్ ధూమ్‌ధామ్ వార్షికోత్సవంలో భాగంగా దాసరి అశోక్ యాదవ్ ఏర్పాటు చేసిన సదర్ పటం ధుమ్‌ధామ్ లో జోగిని శ్యామల బోనంతో నృత్యం చేయడం అందరికి ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కొండ పోచమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రజితరమేష్, ఎంపిపి బాలమల్లేషంగౌడ్, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాస్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, ఎంపిటిసిల మండల ఫోరం అధ్యక్షుడు కావ్య దుర్గయ్య,ఈవో మోహన్‌రెడ్డి, డైరెక్టంలు కనకయ్య,సిబ్బంది వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్, మండల కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఎగ్బల్,యాదవ్‌రెడ్డి. శ్రీశైలం, బాలయ్య పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**వెల్దుర్తి, నవంబర్ 13 ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం వెల్దుర్తి మండలంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేసి వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముందుగా రామాయపల్లి గ్రామంలో వైకుంతధామం, సీసీ రోడ్లను ప్రారంభించారు. బండపోచాన్‌పల్లిలో స్త్రీశక్తి భవనం, గోపాలమిత్ర భవనం, సైన్స్ ఫేర్ కార్యాలయం, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. బండపోచాన్‌పల్లిలో నూతన ఫంక్షన్ హాల్ కోసం 15 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.లబ్ధిదారులకు పోడు భూముల పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఏదులపల్లిలో వైకుంతధామం, వాటర్ ట్యాంక్‌లను ప్రారంభించారు. అనంతరం ఉప్పులింగాపూర్‌లో మాధవానంద స్వామి ఆశీస్సులతో శ్రీ సీతా సమేత అభయ రామచంద్రస్వామి ద్వితీయవార్షికోత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెంటయ్య శాస్త్రి, గరీశ్వరశర్మ, రామదత్తు శర్మ, వెంకటేశ్వరశర్మ మంత్రోచ్చరణల మధ్య ఘనంగా స్వామివారికి హోమాదులు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ప్రత్యేకంగా ఆహ్వానం పలకగా వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మానెపల్లిలో కార్తీక మహోత్సవంలో భాగంగా శత రుద్రాభిషేకం నారాయణ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని, ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్, ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అశోక్‌రెడ్డి, సర్పంచులు నరేందర్‌రెడ్డి, నారాయణ, భూమేష్, శంకర్‌రెడ్డి, నాయకులు మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు, శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, అశోక్‌గౌడ్, కృష్ణ, సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత శేఖర్‌గౌడ్



భారీగా తరలి వచ్చిన భక్తులు

## కొమురవెల్లి మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

**కొమురవెల్లి, నవంబరు 13, ప్రభాతవార్త**

ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒక్కటైన కొమురవెల్లి మల్లిఖార్జునస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు.ఆదివారం సెలవు దినంతో పాటు కార్తీక మాసం రావడంతో భక్తులు తమ పిల్లా పాపలతో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి,మొక్కులు చెల్లించుకున్నారు.కొండపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలలో అత్యంత భక్తి శ్రద్దలతో బోనాలు సమర్పించగా ,మరికొంత మంది భక్తులు రాగి తీగల వద్ద ప్రదక్షనలు,కోడెల స్థబం వద్ద కోడెలు కట్టి పూజలు నిర్వహించారు.భక్తుల రద్దీని దష్టిలో ఉంచకుని అధికారులు ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

# దుర్గమ్మ నామస్మరణతో మార్మోగిన ఏడుపాయల

**పాపన్నపేట, నవంబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణలో అతిపెద్ద రెండవ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని ఆలయం ఆదివారం భక్తుల అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పిల్లాపాపలతో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున అర్చకులు పార్థివశర్మ, రాజశేఖర్ శర్మ, రాముశర్మ, మురళీశర్మ, శంకర్‌శర్మ వేద మంత్రాలు వల్లిస్తూ అమ్మవారి మూలవిరాట్ విగ్రహానికి అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి తలనీలలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి డప్పు చప్పుళ్ల మధ్య శివసత్తుల ఆటలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు.

అమ్మవారికి ఒడిబియ్యం నింపడం, కుంకుమార్చన పూజాకార్యక్రమాలు నిర్వ హించారు. భక్తులకు అమ్మవారి దర్శనానికి ఇబ్బం దులు కలగకుండా ఇఓ సార శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ బాలగౌడ్, ధర్మకర్తలు వెంకటేశం, యాదయ్య, శ్రీనివాస్‌రావు,నాగభూషణం, మోహన్ రావు, చక్రపాణి, బాగరెడ్డి, మనోహర్, సాయిలులు ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్ శర్మ, మహేష్, నరేష్, యాదగిరిలతో కలసి తగు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాలను ఎస్ఐ విజయ్‌కుమార్ ప్రత్యేక ఏర్పాటు చేశారు.





ఏడుపాయల వనదుర్గమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు, దుర్గమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

## సమస్యలు తెలుసుకునేందుకు హాస్టల్ నిద్ర

### -ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్థన్

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్టళ్లలో హాస్టల్ నిద్ర కార్యక్రమాన్ని త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు జేరిపోతుల జనార్ధన్, సంగెం మధులు తెలిపారు. ఆదివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ఇంటి గ్రేటెడ్ హాస్టల్‌ను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు కేవలం 62రూ మాత్రమే చెల్లిస్తుందని,వారికి అవసరమైన సబ్బులు, ఇతర అవసరాల కోసం అవి ఏమాత్రం సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పెరిగిన ధరలకు అనుగునంగా విద్యార్థులకు ప్రతి నెల రూ.200 నుండి రూ. 300 ఖర్చుఅవుతున్నాయని తెలిసిందని, అంతే కాకుండా విద్యార్థులకు రావాల్సిన బిల్లులు జూన్ నుండి పెండింగ్‌లో ఉన్నాయని, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి కాస్మొటిక్ చార్జీలను పెంచి విడుదల చేయా లని డిమాండ్ చేశారు. చదువుకునే విద్యార్థులను ప్రభుత్వం, ప్రైవేట్ స్కూల్లు, కాలేజీల యాజమాన్యం ఇబ్బందులకు గురిచేస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హాస్టల్ కమిటి నాయకులు సురేష్,అరవింద్,ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో తెలుగు రాష్ట్రాలకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

**ప్రధాని నరేంద్రమోడీ విశాఖ పర్యటన సందర్భంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటన**




మెట్టుగూడ, నవంబర్ 13 ప్రభాతవార్త: సికింద్రాబాద్ టు విజయవాడ మధ్య వందే భారత్ రైలు త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. దీంతో ప్రయాణ సమయం తగ్గనుంది. ప్రయాణికుల రద్దీ భారీగా ఉండే సికింద్రాబాద్... విశాఖ, సికింద్రాబాద్ తిరుపతి... కాచిగూడ.. బెంగుళూరు... హైదరాబాద్... ముంబై మార్గాలను మొదట అధికారులు పరిశీలించారు. కానీ వందే భారత్ రైల్లో బెర్తులకు అవకాశం ఉండదు కూర్చొని ప్రయాణం చేయాల్సి ఉండటంతో విజవాడ వరకు పరిమితం చేయాలని అధికారులు ప్రతిపాదనలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఇప్పటికే కేంద్ర రైల్వే శాఖ నుంచి దక్షిణ మధ్యరైల్వేకు సమాచారం అందించనట్లు సమాచారం. రూటుపైనా తుది నిర్ణయం తీసు కోవాల్సి వుందని తెలుస్తోంది. అధికారికంగా రూటు ప్రకటించకపోయినా సికింద్రాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు త్వరలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వస్తోందంటూ కేంద్రమంత్రి ఆదివారం ప్రకటించారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ, అదేవిదంగా సికింద్రాబాద్ టు విశాఖ, దీంతో పాటుగా సికింద్రాబాద్ టు తిరుపతి ఈ మూడు లైన్లలో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా సికింద్రాబాద్ టు విజయవాడ మధ్య ఈ రైలు జనవరి 1వ తేది నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. రోజుకు 25వేల మందికి పైగా ప్రయాణికులు సికింద్రాబాద్..విజయవాడ మధ్య రాకపోకలలు సాగిసున్నప్పటికి ఈ రెండు నగరాల మధ్య ప్రయాణికులు డిమాండ్ భాగానే ఉంది. దీంతో తక్కవ సమయం అనగా నాలుగు గంటల్లోపే రెండు రాజధానుల మధ్య రాకపోకలు సాగించేందుకు వీలుగా వందే భారత్‌కు ప్రవేశపెడుతున్నారు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ మీది నుంచి ఖాజీపేట్ మీదుగా విజయవాడ మార్గాన్ని హైడెన్సిటీ నెట్‌వర్క్ పరిధిలోకి తీసుకు వచ్చారు. 130కి.మీ కంటే ఎక్కువ వేగంతో ప్రయాణించేందుకు వీలుగా ట్రాక్ సామర్థ్యాన్ని పెంచారు.

## బాలాజీ మందిరంలో అన్నకూట్ మహోత్సవం

చార్మినార్, నవంబరు 13 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్బంగా ఆదివారం చార్మినార్ సమీపంలోని చౌక్ మైదాన్ శ్రీ బాలాజీ మందిరంలో అన్నకూట్ మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మందిరం ట్రస్టీలు రాజు పిత్తి, గోవింద పిత్తి, వ్యాపార వేత్త శ్రీనివాస్ బన్సల్, బిజెపి నాయకులు పవన్ మిశ్ర, అనిల్ బజాజ్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కుత్బుల్లాపూర్ డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు మరింత చేరువ: వివేకానంద్

కుత్బుల్లాపూర్, నవంబరు 13 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తానని శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ హామీఇచ్చారు. ఆదివారం డివిజన్ పరిధిలో సుమారు సుమారు రెండుకోట్ల డెబై అయిదు లక్షల వ్యయంతో నిర్మించతలపెట్టిన అభివృద్ధిపనులకు ఆయన స్థానిక మాజీ కార్పొరేటర్ కూన పారిజాత గౌరీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా దత్తాత్రేయనగర్‌లో రూ.లు. 56.50వ్యయంతో సిమెంట్‌రోడ్ల నిర్మాణ పనులు, రూ.లు. 25.50 లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్ ప్యాచ్‌వర్కులు, బాల్‌రెడ్డినగర్ లో రూ.లు.11లక్షలవ్యయంతో ఓపెన్‌జిమ్ ఏర్పాటు, పదా ్మనగర్ ఫేజ్-1లో రూ.లు 54 లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్డు నిర్మాణం, కల్పన సొసైటీలో రూ.లు.26.60లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్ నిర్మాణం ప నులు, మధుసూధన్‌రెడ్డినగర్‌లో రూ.లు.25లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు, ద్వారకాపురి కాలనీలో రూ.లు.36.40లక్షల వ్యయంతో సిమెంట్‌రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కుత్బుల్లాపూర్ టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్ స్వామి, ప్రధానకార్యదర్శి సత్తిరెడ్డి, బోలోజు కిశోర్‌చారి, నార్లకంటి రమేశ్‌యాదవ్, నార్లకంటి బాలయ్యయాదవ్, పెంటయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చార్మినార్, నవంబరు 13 ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ఆరాంఘర్ మెట్రో క్లాసిక్ గార్డెన్ నుంచి బుద్వేల్ వెళ్లటానికి రహదారిని దాటేందుకు ప్రయత్నిస్తున్న జగత్ సింగ్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. కాగా జగత్ సింగ్ ఈ సంఘటనలో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన అజిత్ సింగ్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురికి తరలించారు.

## పాతబస్తీకి మెట్రో దారులెన్నడో?

**నిధుల కొరతతో ముందుకు పడని అడుగు**

**సర్వేలో భూగర్భంలో పైపులు, కేబుళ్ల గుర్తింపు**

**ఎంజీబిఎస్ నుంచి**

**పలక్‌నుమా వరకు పూర్తిచేయాల్సింది 5.5 కి.మీ**



హైదరాబాద్, నవంబరు 13 ప్రభాతవార్త : పాతబస్తీ వరకు మెట్రో రైలు నిర్మాణానికి ఎంత కాలం పడుతుంది? ఎన్నికల లోపు ప్రభుత్వం పూర్తిచేయగలదా? పనులు ఎప్పుడు మొదలెట్టినా మూడేళ్లు పడుతుందని మెట్రో ఇంజినీర్లు అంటున్నారు. తొలిదశ మెట్రోలో జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో మార్గాన్ని ప్రతిపాదించారు. అలైన్‌మెంటగ్ వివాదాలతో జేబీఎస్ నుంచి ఎంజీబిఎస్ వరకే నిర్మించారు. ఎంజీబిఎస్ నుంచి పలక్‌నుమా వరకు 5.5కి.మీ పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వం ఎప్పుడు ఆదేశిస్తే అప్పుడు పనులు మొదలెట్టేందుకు వీలుగా సర్వసన్నద్ధంగా ఉన్నామని అధికారులు చెబుతున్నారు. పాతబస్తీ వరకు మెట్రోకు ప్రభుత్వం అనుమతివ్వగానే పనులు మొదలు పెట్టేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ సన్నద్ధంగానే ఉంది. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మధ్య గ్రౌండ్ ఫెనెట్రేటింగ్ రాడర్ (జీపీఆర్) సర్వే ద్వారా రోడ్డు తవ్వకుండానే భూగర్భంలో రాళ్లు, పైపులు, కేబుల్స్ ఎక్కడ ఉన్నాయి. ఏ మేరకు ఉన్నాయనేదానిపై అంచనాకొచ్చారు. అలైన్‌మెంట్ మార్గంలో పెద్ద ఎత్తున మంచినీటి, వరదనీటి పైపులు, విద్యుత్ ఇతర కేబుళ్లు ఉన్నట్లు గుర్తించారు. మెట్రో స్తంభాలు వేసేందుకు ఇదే పెద్ద సవాల్‌గా ఉంది. సేకరించే ఆస్తుల్లో ప్రార్థనా స్థలాలున్నాయి. ఈ రెండుపనులు పూర్తిచేస్తేనే మెట్రగోకు అడుగు ముందుకు పడుతుంది.

ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా మధ్య మిగిలిన మెట్రో పనులు పూర్తి చేయాలంటే సుమారు రూ.2వేల కోట్ల నిధులు అవసరం అవుతుందని అంచనా. ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించినా ఇంతవరకు ఆ నిధులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం ఎప్పుడు పచ్చజెండా ఊపుతుందనేది చూడాల్సి వుంది. ఈ పనులను ఎల్అండటి మెట్రో పూర్తిచేయాలి. అలైన్‌మెంట్ వివాదంపై గతంలో సర్కారు త్వరగా నిర్ణయం తీసుకోకపోవడంతో 5.5కి.మీ వదిలేసి 69కి.మీ పనులను పూర్తి చేశారు. ప్రభుత్వం నిధులిస్తే చేయగలమని సంస్థ అంటోంది. చిన్న మార్గమే అయినా వెయ్యికిపైగా ఆస్తులు సేకరించాల్సి ఉంది. ఇందులో మతపరమైన కట్టడాలు ఎక్కువగా ఉన్నాయి. మార్కింగ్ చేసినంత వరకు వీటిని తొలగించడం పెద్ద సవాలే. ప్రభుత్వ చొరవతోనే అది సాధ్యం. ఇక్కడి భవనాలు చాలా వరకు కూలిపోయే దశలో ఉన్నాయి. ఆస్తుల సేకరణ చేపడితే ఆయా యజమానులు ఇచ్చేందుకు సిద్ధం ఉన్నారని మెట్రో వర్గాలు పేర్కొంటున్నాయి.

మెట్రో అలైన్‌మెంట్ దారుల్‌షిపా నుంచి శాలిబండ మీదుగా ఫలక్‌నుమా వరకు వెళ్తుంది. రహదారి తక్కువ విస్తీర్ణంలో ఉంటుంది. భూగర్భంలో పైపులైనులు, కేబుళ్లు, పురాతన వరద కాలువలు ఉన్నాయి. వీటిని తొలగిస్తే కొత్త సమస్యలు ఎదురయ్యే ప్రమాదముంది. నష్టం జరగకుండా పనులు చేయాలంటే స్తంభాల అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాల్సి ఉంది. ఇదీ పెద్ద సవాల్.స్తంభం స్థానాలు మార్చడమా?అక్కడ ఉన్న యుటిలిటీస్‌ను తరలించడమా అనే చర్చ జరుగుతోంది. అన్ని ప్రత్యామ్నాయాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

## ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో నిందితుడు నందకుమార్‌కు షాక్

**ప్రాపర్టీ కూల్చివేసిన జిహెచ్ఎంసి**



హైదరాబాద్, నవంబరు 13 ప్రభాత వార్త : ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో నిందితుడిగా ఉన్న నందకుమార్‌కు చెందిన అక్రమ నిర్మాణాలను జిహెచ్ఎంసి అధికారులు కూల్చివేశారు. ఫిల్మ్ నగర్‌లోని హోటల్ దక్కన్ కిచెన్‌లో కొంత భాగాన్ని జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబుకు చెందిన స్థలాన్ని నందకుమార్ లీజుకు తీసుకున్నారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా దక్కన్ కిచెన్ ప్రాంగణంలో రెండు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అధికారులు అనేకసార్లు నోటీసులు ఇచ్చినా పనులు ఆపకుం డా కొనసాగిస్తుండటంతో ఆదివారం కూల్చివేతలను చేపట్టారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు మధ్య అక్రమ నిర్మా ణాలను కూల్చివేశారు. నందకుమార్ స్థలాన్ని లీజుకు తీసుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడని, అందువల్లే కూల్చివేస్తున్నామని జిహెచ్ఎంసి అధికారులు తెలిపారు. కోర్టు ఆదేశాలతోనే తాము అక్రమ నిర్మాణాలను కూల్చివేయించామని అధికారులు తెలియజేశారు. అయితే భవనం కూల్చివేతను నందుకుమార్ భార్య చిత్ర అడ్డుకున్నారు. తమ లీజు ల్యాండ్‌లో అక్రమంగా కూల్చివేతలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే భవనం కూల్చివేశారంటూ ఆరోపించారు. అన్ని ఆధారాలను అధికారులకు అందిస్తామని చిత్ర తెలిపారు.ఎమ్మెల్యేల కొనుగోళ్ల కేసులో దర్యాప్తు చేస్తున్న సిట్ అధికారులు మరిన్ని ఆధారాల కోసం శనివారం రాత్రి నుంచి నందకుమార్ ఇంటితోపాటు ఆయన నిర్వహిస్తున్న డెక్కన్ హోటల్‌లోనూ తనిఖీలు చేయగా అక్రమ నిర్మాణాల విషయం బయటపడింది. దీంతో ఆదివారం ఉదయమే జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ సిబ్బంది నోటీసులు ఇచ్చినా.. నిర్మాణ పనులు ఆపకుండా కొనసాగించారు. దీంతో జిహెచ్ఎంసి సిబ్బంది జేసీబీలను తీసుకొచ్చి కూల్చివేతలు చేపట్టారు.

## మంత్రి, కమిషనర్ చెప్పినా.. వీళ్లు వినరా..?

**అసిస్టెంట్ సిటీ ప్లానర్ల కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు**

**కోట్ల ప్రభుత్వ ఆదాయాన్ని మింగేస్తున్న ఓ ఇద్దరు**




బాలానగర్ జోన్ ప్రతినిధి, నవంబరు 13 ప్రభాతవార్త: భవన నిర్మాణ నిబంధనలను మరింత ఖచ్చితంగా అమలు చేయాలని ఓ వైపు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆదేశాలు జారీ చేస్తుండగా మరో వైపు 25,26, 27 సర్కిళ్ళలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు(ఏసీపీలు) అందుకు విరుద్ధంగా వ్యవహ రిస్తూ అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందిస్తుం డడంతో రూ.కోట్ల గ్రేటర్ ఆదాయానికి గండి పడుతోంది. మరో వైపు జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్ కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ నిర్మాణాలను అనుమతించొద్దని, గ్రేటర్ ఆదాయ పెంపుకు చర్యలు తీసుకోవాలని చెబుతుండగా కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు అదుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ తమ స్వార్ధ ప్రయోజనాలకే పరి మితమై రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతున్నారు. భవన నిర్మాణాలపై నిత్య పర్యవేక్షణ చేయాల్సిన సంబం ధిత అధికారులు కొందరు మామూళ్ళ మత్తులో మునిగితేలుతున్నారు. అక్రమ కట్టడాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాక్‌బృందం అసలు పనిచేస్తోందా అనే అనుమానం కలుగక మానదు. అడ్డు అదుపు లేకుండా కొనసాగు తున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో డిప్యూటీ కమిషర్లతో పాటు ఏసీపీలు ఘోరంగా విఫలమవుతున్నారు. బహుళ అంతస్తుల భవనాలలో ప్లాట్లను కొనుగోలు చేసేందుకు ఉద్యోగులు, వ్యాపార వేత్తలు, రిటైర్డ్ ఉద్యోగులు, మద్యతరగతి వర్గాల వారు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో బహుళ అంతస్తుల భవనాలు అనేక ప్రాంతాల్లో పుట్టగొడు గుల్లా పుట్టుకొస్తున్నాయి. నగరానికి ధీటుగా ఇక్కడి స్థలాలకు డిమాండ్ పెరుగడంతో బహుళంతస్తుల భవనాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. ఇళ్ళ నిర్మాణంలో నిబంధనల్ని పాటించడంలేదని సామాన్య మధ్య తరగతి ప్రజల్ని ముప్పుతిప్పలు పెట్టే అధికారులు, నిబంధనలు పాటించని అనేక మంది బిల్డర్ల బహుళంతస్తుల భవనాల్ని అనుమ తులు లేకుండా నిర్మిస్తున్నా పట్టించుకున్న పాపాన పోవడంలేదు. గాజుల రామారం, కుత్బుల్లాపూర్, అల్వాల్ సర్కిళ్ళ పరిధి లోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. అప్పుడప్పుడు ఉన్నతాధికారుల దృష్టిని మరల్చడానికి ఏదో మొక్కుబడిగా కొన్ని అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు చేపట్టకుండా మొక్కుబడిగా నోటీసులు జారీచేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. పైగా న్యాయస్థానాలకు ఆశ్రయించి ఏ విధమైన చర్యలు చేపట్టకుండా స్టే తెచ్చుకుంటే బావుంటుందనే ఉచిత సలహాలను సైతం నోటీసులు ఇచ్చిన భవన యజమానులకు కొందరు అధికారులు సలహాలు ఇస్తున్నారన్న ప్రచారం కూడా బాహాటంగానే వినిపిస్తోంది. రెసిడెన్సియల్ పేరిట అనుమతులు తీసుకుంటున్న అనేక మంది బిల్డర్లు, వాణిజ్య అవసరాల నిమిత్తం మడిగెలు, దుకాణాల్ని నిర్మిస్తున్నారు. అనుమతుల కోసం ముం దుగా ప్లాన్‌లో అన్నీ సక్రమంగానే ఉన్నట్లు పేర్కొని భవన నిర్మాణ అనుమతులు పొంది ఆ తర్వాత అందుకు విరుద్దంగా వ్యవహరిస్తు న్నారు. అక్రమంగా నిర్మిస్తున్న కమర్షియల్ భవనాల్ని సంబంధిత అధికారులు అడ్డుకోకపోవడంతో ఒకరిని చూసి మరొకరు పోటీపడి వాణిజ్య అవసరాలకు నిర్మించి కోట్లాదిరూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు పొందిన దానికి విరుద్దంగా నిర్మాణాలు చేపడుతుండడంతో కోట్లాది రూపాయల జిహెచ్ఎంసి ఆదాయానికి గండిపడుతుంది. నిబంధనలు పాటించని బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని చెబుతున్న అధికారులు ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. అపార్ట్ మెంట్లలోని ప్లాట్లను కొన్న తర్వాత అందులో సదుపా యాలు లేక కొనుగోలుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ కోసం స్థలం లేకపోవడంతో వాహనాలను బయటనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితినెలకొంది. అక్రమ అపార్ట్‌మెం ట్లు పుట్టుకొచ్చి అధికారులు, బిల్డర్ల మాయాజాలం మూలంగా అమాయకులు, లక్షలాది రూపాయలకు ప్లాట్లను కొని నిలువునా మోసపోతున్నారు. ఉన్నతాధికారులు కూడా సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వల్లనే అపార్ట్‌మెంట్లలో ప్లాట్లను కొని కొనుగోలు దారులు మోసపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అనేక ప్రాంతాల్లో అడ్డదిడ్డంగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు సర్కిల్ ఉన్నతాధి కారులు టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతే కారణమని ప్రజలు విమర్శిస్తున్నారు. సర్వాధికారాలు ఈ అధికారులకు ఉన్నప్పటికీ జోనల్, సర్కిల్ అధికారులతోపాటు టౌన్‌ప్లానింగ్ విభాగం ఏసీపీలు ఇటీవలి కాలంలో పెద్దఎత్తున వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై కూడా చర్యలు తీసుకున్న దాఖాలాలు లేవు. ఏదో మొక్కుబడిగా అప్పుడప్పుడు కొన్ని అక్రమ నిర్మాణాలను పాక్షికంగా తొలగించి రంధ్రాలు చేసి సెంట్రింగ్ చెక్కలను తొలగించడం వంటి జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. పరిసర ప్రాంతాల్లో అక్రమ అపార్ట్‌మెంట్లు కొందరు అధికారులను కుబేరులుగా మారుస్తుంది

**వసూళ్లలో ఓ ఇద్దరు యమ బిజీ..**

**రెచ్చిపోతున్న అవినీతి అనకొండలు..**

అక్రమార్జనలో కొత్త రికార్డులు సృష్టిస్తోన్న 25, 26 సర్కిళ్ళ టౌన్‌ప్లానింగ్ విభాగంపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ), విజిలెన్స్ విభాగాల నిఘా అంతంత మాత్రంగా ఉండడంతో అవినీతి మాత్రం తగ్గకపోగా రోజు రోజుకు తారా స్థాయికి చేరుకుంటుంది. కుత్బుల్లాపూర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహించడంతోపాటు శివార్లలోని మరో మున్సి పాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఇంచార్జీ బాధ్యతలు నిర్వహిస్తూ జోడు పదవులు నిర్వహిస్తోన్న అధికారి అక్రమ అపార్ట్ మెంట్లు చేపడుతున్న బిల్డర్లు, నిర్మాణదారుల వద్ద రూ.కోట్ల మేర వసూళ్ళు చేస్తున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ సదరు అధికారి అసలు పట్టించుకోవడంలేదు. నివాస యోగ్య భవనాల కోసం అనుమతి పొంది కమర్షియల్ భవనాల్ని నిర్మిస్తున్నా సర్కిల్ 26 సర్కిల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీపీ) కార్యాలయంలో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న మరో అధికారి పట్టించుకోకుండా రూ. కోట్ల ముడుపుల్ని వసూలు చేయిస్తూ జేబులు నింపుకోవడానికి మాత్ర మే పరిమితయ్యాడనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అక్ర మ వసూళ్ళలో తలమునకలై ప్రభుత్వ డ్యూటీకి తూట్లు పొడుస్తూ రూ.కోట్ల మేర అక్రమార్జనకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారు. అక్రమ సంపాదనతో వీళ్ళకు శివార్లతోపాటు వేరే జిల్లాల్లో భారీగా అక్రమాస్తులు ఉన్నట్లు గుస గసలు వినిపిస్తున్నాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టిసారిస్తే వీరి అవినీతి గుట్టు బయటపడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

## భార్య వివాహేతర సంబంధం.. వేధనతో భర్త బలవన్మరణం

**సెల్ఫీ వీడియోలో భార్య ప్రవర్తన గురించి వివరించిన భర్త**

**తన పిల్లల జీవితాలు కాపాడాలని పోలీసులకు విజ్ఞప్తి**

**నాగాంజలి, స్వరూప్‌రెడ్డిపై మృతుడి తండ్రి ఫిర్యాదు**

**ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన**



విలపిస్తున్న మృతుడి తల్లిదండ్రులు



మృతుడు శేఖర్ (ఫైల్ ఫోటో)

ఎల్.బి.నగర్, నవంబర్, 13 ప్రభాతవార్త : భార్య అక్రమ సంబంధం పెట్టుకుందని తట్టుకోలేని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. తన పిల్లలు అనాధలు కాకుండా కాపాడాలని సెల్ఫీ వీడియోలో మృతుడు పోలీసులను వేడుకున్నాడు. ఈ సంఘటన సరూర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సరూర్‌నగర్‌లో నివాసం ఉండే గూడూరు శేఖర్(35) సెల్ఫీ వీడియో తీసుకొని ఈనెల 8వ తేదీన బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గూడూరు శేఖర్‌తో మురుపాకుల ఏడుకొండలు పెద్దకూతురై నాగాంజలితో 2014 ఫిబ్రవరి 14న వివాహం జరిగింది. వీరికి ఒకకూతురు, ఒకకుమారుడు ఉన్నారు. నాగాంజలి హైదరాబాద్ కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయములో పని చేస్తూ ఈ సవంత్సరం జనవరిలో ఆదిలాబాద్‌కు బదిలీ అయింది. కాగా 2019 సవంత్సరం నుండి తేజస్వరూప్‌రెడ్డి అనే వ్యక్తితో చనువుగా ఉండడాన్ని భర్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని నిలదీయగా, తప్పు ఒప్పు కుని పెద్దల సమక్షంలో భవిష్యత్తులో తప్పు లం పునరావృతం కాదని క్షమాపణ కోరింది. అయితే ఆదిలాబాద్ బదిలీ అయిన వెంటనే స్వరూప్‌రెడ్డితో కలిసి ఆదిలాబాద్‌లో వారిద్దరూ సహజీవనం కొనసాగించడం శేఖర్‌కు మింగుడు పడలేదు. భార్య అక్రమ సంబంధంతో తీవ్ర మనస్థాపానికి గురైన శేఖర్ ఈ నెల 8న మధ్యాహ్నం విషంతాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఆత్మహత్యకు పాల్పడ్డ శేఖర్‌ను ప్రయివేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ నవంబర్ 9వ తేది రాత్రి శేఖర్ తుది శ్వాస విడిచాడు. కాగా తన కొడుకు శేఖర్ మృతికి కారకులైన నాగాంజలి, అదిలాబాదులో నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న తేజస్వరూప్‌రెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తండ్రి గూడూరు శంభయ్య 9వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆత్మహత్యకు ముందు శేఖర్ తన ఆవేదనను భార్య గురించి సెల్ఫీవీడియోలో వివరిస్తూ కన్నీటిపర్వతం అయ్యాడు. ఎవరి వలన అయితే తమ కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డాడో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తన కుమారుడిలాగా మరెవ్వరికి ఇలాంటి దుస్థితి రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదులో కోరారు. కుమారుడు శేఖర్ మరణంతో కుటుంబ సబ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కాగా నాగాంజలి తల్లిదండ్రులు ఏడుకొండలు, మల్లేశ్వరి, స్వరూప్‌రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నేటి నుంచి సాలార్‌జంగ్ మ్యూజియంలో బాలల వారోత్సవాలు

చార్మినార్, నవంబరు 13 ప్రభాతవార్త : సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈ నెల 14వ తేదీ సోమవారం నుంచి బాలల వారోత్సవాలు ప్రారంభం కానున్నాయని మ్యూజియం డైరెక్టర్ డాక్టర్.నాగేందర్‌రెడ్డి తెలిపారు.జంట నగరాలకు చెందిన పాఠశాలల విద్యార్థులను సీనియర్,(9,10 తరగతుల విద్యార్థులు) జూనియర్ (6,7,8తరగతులు విద్యార్థులు) విభాలుగా విభజించి వ్యాసరచన,వక్తృత్వం,డ్రాయింగ్ పోటీలను జరుపుతున్నామని ఆయన తెలియజేశారు.నవంబరు నెల 15న వ్యాస రచన,16న వక్తృత్వం, 17న డ్రాయింగ్ పోటీలు తెలుగు హిందీ,ఇంగ్లీషు,ఉర్దూ భాషలలో ఉంటాయని ఆయన తెలిపారు. పోటీలలో గెలు పొందిన విజేతలకు బహుమతులు ప్రధానం చేయనున్నామని ఆయన తెలియజేశారు

## తెలంగాణ వచ్చిన తరువాతే ఆలయాల అభివృద్ధి

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇతర నేతలు

కంటోన్మెంట్, నవంబర్ 13 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తరువాతనే దేవాలయాలు ఎంతో అభి వృద్ధి చేయడం, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మోండామార్కెట్‌లోని ఎంతో చారిత్ర కలిగిన శ్రీ మైసాసుర అంజనేయస్వామి ఆలయాన్ని పునర్ని ర్మాణం అనంతరం ఆదివారం ప్రారంభో త్సవ పూజలు జరిపారు. ఈ కార్యాక్ర మంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. మంత్రిని ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోండా మార్కెట్‌లోని ఆంజనేయ స్వామి ఆలయానికి ఎంతో చరిత్ర ఉందని, అంతేకాకుండా మహంకాళి అమ్మవారి ఆలయం, బల్కంపేట్ ఎల్లమ్మ దేవాలయం, గణేష్‌టెంపుల్‌లు సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోనే ఉండడం మన అదృష్టం అన్నారు. ఈ ఆలయాలను ప్రభుత్వం, దాతల సహకారంతో ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సికింద్రాబాద్ గణేష్ టెంపుల్‌ను కూడా రూ. 20కోట్లు వెచ్చించి అభివృద్ధికి ఏర్పాట్లు చేస్తూన్నట్లు తెలిపారు. ఈ కార్యాక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం టీఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, స్కైలాబ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూపా, ఆలయ కమిటీ సభ్యులు మధు, నేతలు ఆకుల హరికృష్ణా, నాగులు, జయరాజ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా జర్నలిస్టు కోట్ల రామకృష్ణ మృతి

ఉప్పల్, అక్టోబరు 13 ప్రభాతవార్త : తెలం గాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు కోట్ల రామ కృష్ణ (52) శనివారం రాత్రి 10.30గంటలకు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కోట్ల రామకృష్ణ సీనియర్ జర్నలిస్టుగా కొనసాగుతు న్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రామకృష్ణ బోడుప్పల్‌లోని శ్రీకర ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆది వారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, తెల్కపల్లి మండలం, ఆలేరు గ్రామానికి చెందిన నగరానికి వచ్చి బోడుప్పల్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో ఆదివారం నిర్వహించారు.

**మంత్రి, స్పోర్ట్స్ ఛైర్మన్ సంతాపం..** సీనియర్ జర్నలిస్టు కోట్ల రామకృష్ణ మరణం పట్ల మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర స్పోర్ట్స్ ఛైర్మన్ అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి, తెలంగాణ జూనియర్ కాలేజ్ పిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డా.అలేరు బాలరాజు, ప్రధాన కార్యదర్శి డా.బొమ్మర బోయిన లక్ష్మయ్య తీవ్ర సంతాపం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ క్రీడాకారుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. సుదీర్ఘకాలంగా జర్నలిస్టుగా రాష్ట్ర క్రీడల అభివృద్ధిలో క్రీడాకారుల సంక్షేమం కోసం రామకృష్ణ ఎంతో సేవ చేశారని కొనియాడారు. రామకృష్ణ కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని వ్యక్తం చేశారు.

## ఘనంగా కుత్బుల్లాపూర్ గోకుల యాదవసంఘ వనభోజనాలు

కుత్బుల్లాపూర్, నవంబరు 13 ప్రభాతవార్త : కలిసికట్టుగా నిరుపేద యాదవులకు సహయ,సహకారాలను అందించి సంఘ అభ్యున్నతికి ఒకరికి ఒకరుతోడ్పాటును అందించుకోవాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ పిలుపునిచ్చారు. ఆదివారం హెచ్ఎంటి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆయన సమీపంలో కుత్బుల్లాపూర్ పరిధిలోని గోకుల యాదవ సంఘ వనభోజనాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక వనభోజనాల సందర్భంగా గోకుల యాదవసంఘం నిర్వహించిన మహోత్సవానకి వందలాది మంది యాదవ సంఘ కుటుంబీకులు పాల్గొని ఆట,పాటలతో సందడిచేశారు. ఉదయం తొమ్మిది గంటలనుండి సాయంత్రం ఆరుగంటల వరకు పిల్లలు, మహిళలు, యువకులకు క్రీడాపోటీలు, ఆట,పాటలతో సభాప్రాంగాణం అ ంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమంలో జంట నగరాల యాదసంఘ ప్రతినిధులు యూసుఫ్‌గుడ యాదవసంఘ నాయకులు చిన్న నవీన్‌కుమార్, మేడ్చల్ మార్కెట్‌యార్డ్ చైర్మెన్ రవిందర్‌యాదవ్, బిజెపి నాయకులు జె.కె.శేఖర్‌యాదవ్, టిఆర్ఎస్ యువజన విభాగం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు దూదిమెట్ల సోమేశ్‌యాదవ్, బిసి సంఘ నాయకులు రాజశేఖర్‌యాదవ్, కౌన్సిలర్లు మురలీయాదవ్, దుండిగల్ జక్కుల శ్రీనివాస్‌యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు మల్లేశ్‌యాదవ్, కుత్బుల్లాపూర్ గోకుల యాదవసంఘ అధ్యక్షులు ఎల్.వెంకట్‌రావు యాదవ్, ప్రధానకార్యదర్శి తిరుమలరావు యాదవ్, క్రియాశీలక అధ్యక్షులు కె.శ్రీనివాసరావు యాదవ్, జె.భవన్నారా యణ యాదవ్, ఉపాధ్యక్షులు శివరామకృష్ణయాదవ్ పాల్గొన్నారు.



ప్రతిభచాటిన క్రీడాకారులను సన్మానిస్తున్న టీఆర్ఎస్ యువ నాయకులు

## క్రీడాకారులకు సన్మానం

**పటాన్‌చెరువు, నవంబరు 13, ప్రభాతవార్త:** ఢిల్లీలో ఇటీవల నిర్వహించిన రెండవ జాతీయ వాకో ఇండియా కిక్ బాక్సింగ్ 57 కేజీల విభాగంలో రజత పతకం సాధించిన పటాన్‌చెరువుకు చెందిన హర్షవర్ధన్‌గౌడ్‌ను టిఆర్ఎస్ నాయకులు గూడెం విష్ణువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ క్రీడాకారులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో జిఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. భవిష్యత్తులో హర్షవర్ధన్‌గౌడ్ మరిన్ని పథకాలు సాధించాలని, అందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. క్రీడా పోటీలను ఏర్పాటు చేసి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తామన్నారు.

## ఆలయ నిర్మాణానికి రూ. 2 లక్షల ఆర్థిక సహాయం



ఆలయ నిర్మాణానికి 2 లక్షల విరాళం అందచేస్తున్న ప్రకాశం చారి

**పటాన్‌చెరువు, నవంబరు 13, ప్రభాతవార్త:** జంగంపేటలో శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి టిఆర్ఎస్ నాయకులు పులిగిల్ల ప్రకాశం చారి సహకారం అందించారు. ఆదివారం ఆలయ కమిటీ బాధ్యులకు ప్రకాశం చారి 2 లక్షల 7వందల రూపాయలను అందించారు. ఈ సందర్భంగా ప్రకాశం చారి మాట్లాడుతూ హిందూ సాంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటి బాధ్యులు, ప్రజాప్రతినిధులు సర్పంచ్ జి వెంకటయ్య, ఉప సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు వెంకటేష్‌గౌడ్, వార్డు సభ్యులు సిద్దునూరి శంకర్, నర్సా రెడ్డి, మల్లారెడ్డి, సిహెచ్ దుర్గేష్‌యాదవ్, జి ఈశ్వరయ్య, జే మహేష్, వల్కఆటి నర్సింలు, శ్రీనివాసులులు దాత ప్రకాశం చారికి కృతజ్ఞతులు తెలిపారు.

## సమిష్టి సహకారంతో కాలనీల అభివృద్ధి



అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్

**సంగారెడ్డి, నవంబర్ 13 ప్రభాతవార్త:** సమిష్టి సహకారంతో అమీన్‌పూర్ మున్సిపాలిటిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలలో ఐదు కోట్ల 25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న యూజీడీలు, సిసిరోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తో కలిసి శంఖుస్థాపన చేశారు. అనంతరం బీరం గూడ శివాలయప్రాంగణంలో వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనభోజన మహో త్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూతన కాలనీల లో మౌలికవసతుల ఏర్పాటుకు పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింగహగౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, టిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లబ్ హౌస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**సంగారెడ్డి, నవంబర్ 13, ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బృందావన్ టీచర్ కాలనీలో నూతనంగా నిర్మించిన క్లబ్ హౌస్‌ను ఆదివారం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ప్రారంభించారు. అనంతరం కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన వనభోజన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, వార్డు కౌన్సిలర్లు, కో అప్షన్ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కరాటే బెల్టులు ప్రదానం



విద్యార్థులకు కరాటే బెల్టులను ప్రదానం చేసిన దృశ్యం

**సదాశివపేట, నవంబర్ 13, ప్రభాతవార్త:** పట్టణంలోని బసవ సేవ సదాన్‌లో జపాన్ కరాటే అసోసియేషన్ అధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలు శంకర్ నిర్వహించారు. ఈ పరీక్షలకు వివిధ ప్రాంతాల నుండి 300ల మంది విద్యార్థి, విద్యార్థినీలు పాల్గొన్నారు. సదాశివపేట, సంగారెడ్డి, ఝరాసంగం, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల నుండి తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ చైర్మన్ చింతా ప్రభాకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతాగోపాల్, శ్రీశైలం, విశ్వనాథ్, సత్యం, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజులు పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులకు బెల్టులను ప్రదానం చేశారు. ఈ పరీక్షలకు జిల్లా నుండి సీనియర్ అధ్యక్షులు రాజుగౌడ్, సిద్దస్వామి, సతీష్‌గౌడ్, అశోక్, మహేష్, ప్రశాంత్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## కళ్లకాల్‌లో కరాటే గ్రేడింగ్ పోటీలు

**మనోహరాబాద్, నవంబర్ 13 ప్రభాతవార్త:** మనోహరాబాద్ మండలం కళ్లకాల్ గ్రామంలో ఆదివారం సన్‌షైన్ షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో గ్రేడింగ్ టెస్టులను నిర్వహించారు. ఈ పోటీల్లో ఎనిమిది మంది కరాటే విద్యార్థులు బ్లాక్ బెల్టులు సాధించారని గ్రాండ్ మాస్టర్‌లు నర్సింగరావు, మల్లేష్ ముదిరాజ్‌లు తెలిపారు. ఈ పోటీల్లో వివిధ విభాగల్లో 150 మంది కరాటే విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ ఎస్ఐ రాజుగౌడ్, కరాటే క్లబ్ చైర్మన్ ఎల్. శ్రీనివాస్‌గౌడ్, మనోహరాబాద్ ఎంపీపీ పురం నవనీత రవి, సర్పంచి నత్తి మల్లేష్ ముదిరాజ్, గ్రామస్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్లాక్ బెల్ట్‌ను ప్రధానం చేస్తున్న ఎస్ఐ రాజుగౌడ్

# రింగ్ మేన్ రేపటి సిద్దిపేటకు వరం

### మల్లన్న సాగర్ నుంచి సిద్దిపేటకు తాగునీరు... ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

రింగ్ మేన్ రేపటి సిద్దిపేటకు ఓ వరమని రాష్ట్ర ఆర్థిక,ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. రూ50కోట్లతో ఈ స్కీమ్ చేపట్టినట్లు ,పది తరాలకు సరిపడేలా కొత్త సంవత్సరం నుండి మల్లన్న సాగర్ ద్వార సిద్దిపేటకు సాగునీరు అందించనున్నామని పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేటలోని మూడవ వార్డులో మిలాన్ గార్డెన్ సమీపంలో 10 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్నసాగర్ నుండి సిద్దిపేటకు 50 కోట్లతో తాగునీటి సౌకర్యం కోసం పనులు చేపట్టడం జరిగిందని డిసెంబరు నెలాఖరులోగా పనులు పూర్తవుతాయన్నారు.సిద్దిపేట పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన, శుద్ధి చేసిన తాగునీరు అందించేలా మల్లన్నసాగర్ నుండి గ్రావిటీ ద్వార పట్టణ ప్రజలకు అవసరమైన తాగునీటిని అందించేలా ఈ పథకాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. గతంలో రెండు జిల్లాల పరిధిలో యశ్వాడ లిఫ్టు ద్వార తాగునీరు తేవడంతో విద్యుత్ ఇతరత్రా అవాంతరాలు ఏర్పడి పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరాలో ఇక్కట్లు కలిగేవని అలాంటి అవాంచనీయ సంఘటనలు లేకుండా 50టిఎంసీలు కలిగిన కొమురవెల్లి మల్లన్న సాగర్‌లో 10టిఎంసిల స్వచ్ఛమైన శుద్ధి చేసిన అవసరమూన తాగునీటిని సిద్ధిపేట ప్రజలకు అందిస్తున్నట్లు వివరించారు.ప్రజలంతా నీటిని పొదుపుగా వాడుతూ తాగునీటి వృదాను అరికట్టాలని పిలుపునిచ్చారు.



వాటర్ ట్యాంక్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీష్‌రావు



భూమిపూజ చేస్తున్న సర్పంచ్

## నూతన పంచాయతీ భవనానికి భూమిపూజ

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 13, ప్రభాతవార్త:** సంగారెడ్డి మండలం పసల్‌వాది గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణం కొరకు ఆదివారం భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పట్నం నిర్మలదేవిమాణిక్యం, డిసిసిబి ఉమ్మడి జిల్లా వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, ఉపసర్పంచ్ రవితేజ, నాయకులు శారదసుధాకర్‌రెడ్డి, సాయక్క, సాయన్న, ప్రభాకర్‌రెడ్డి, సోమశేఖర్, అంజయ్య గౌడ్, గొడుగు రాములు, లింగమయ్య, నాగేష్, యువజన సంఘాల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

**మెదక్ మున్సిపాలిటీ, నవంబర్13 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సాధారణ సమావేశం, ఎన్నికలను ఆదివారం మెదక్ పట్టణంలోని ఇందిరి గాంధీ స్టేడియంలో నిర్వహించారు. ఈ ఎన్నిక ప్రక్రియలో వ్యాయామ ఉపాధ్యాయులు, అథ్లెటిక్స్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఎన్నికల అధికారిగా వి. బాలకృష్ణ, ప్రిన్సిపాల్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ అబ్జర్వర్ కె.పి. అనిల్ కుమార్‌ల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ జరిగింది. అధ్యక్షులుగా అరుణార్తి వెంకటరమణ, కార్యదర్శిగా ఎ. మధుసూదన్, ఉపాధ్యక్షులుగా ఎ. శ్వేతకుమారి, పి. రమేష్, ఎ. శ్రీధర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా ఇ. రాజేందర్, కె. శ్యామ్, ఎన్. రేవంత్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్‌గా ఎస్. నాగరాజు, ఎస్. శ్రీనివాస్‌రావు, జి. మాధవరెడ్డి, ఎ. సత్యనారాయణ, బి. దేవేందర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

## గుండన్నపల్లిలో పత్తి పంటపై క్షేత్ర ప్రదర్శన

**గజ్వేల్, నవంబర్ 13 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గుండన్నపల్లి గ్రామానికి చెందిన రైతు గోపి వేద సీడ్ సదానంద్ గోల్డ్ కంపెనీ పత్తి విత్తనాలను సాగుచేయగా ఆదివారం ఆ కంపెనీ ప్రతినిధులు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రైతులకు పత్తి పంట సాగుపై, వేద సీడ్ సదానంద్ గోల్డ్ పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు జిఎం నరేంద్ర, డిజిఎం ఎవి.నారాయణ, ఏఎం వంశీకృష్ణ, ఫీల్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి

**ములుగు, నవంబర్ 13 (ప్రభాతవార్త):**

ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిద్దిపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరవింద్, ప్రశాంత్‌లు అన్నారు. ఆదివారం ములుగు ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ కార్యర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైద్రాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుండి విద్యార్థి నాయకులు, ప్రతినిధులు, మేధావులు సమావేశానికి హాజరవుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు వెన్నెల, గజ్వేల్ డివిజన్ కార్యదర్శి నవీన్, మండల నాయకులు నరేష్, చింటు, శివ, సాయి, మణికంత, అరుణ్ పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం



బీఎస్పీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మేత్రి బాబు

## బీఎస్పీ మండల అధ్యక్షుడిగా మేత్రి బాబు

**కంగ్టి, నవంబర్ 13, ప్రభాతవార్త:** బహుజన్ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడిగా మేత్రి బాబు, సెక్టర్ అధ్యక్షులుగా వాగే రాజు లను నారాయణ ఖేడ్ ఇంచార్జ్ అలిగే జీవన్, బోర్గి భీమన్న ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ బీఎస్పీ పార్టీ బలోపేతానికి ఎల్లవేళల కృషి చేస్తానని తెలిపారు. పూలే, అంబేద్కర్, మాన్యశ్రీ కాన్షిరంల ఆశయ సాధనకై పనిచేస్తానని పేర్కొన్నారు. జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. 75 సంవత్సరాలుగా అగ్రవర్ణ పార్టీలే రాజ్యాన్ని ఏలాయని, బహుజనులకు ఎలాంటి మేలు చేయలేదని, 90 శాతం బహుజనలు ఉన్నప్పటికీ కేవలం 10 శాతం ఉన్న అగ్రవర్ణ పార్టీల రాజ్యమేలాయని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరగాలంటే అది బహుజన సమాజ్ పార్టీతో సాధ్యమన్నారు. కార్యక్రమంలో కంగ్టి గ్రామ అధ్యక్షులు కొంకే అరుణ్, ప్రధాన కార్యదర్శి శ్రీమన్, దిలీప్, దావీద్, సుమంత్, నరేష్, జయశంకర్, ప్రవీణ్, సుమంత్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

**మెదక్, నవంబర్ 13, ప్రభాతవార్త:** చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంద మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామి ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు రాచంద్రం, నర్సింలు, ఉదయ్ కుమార్, వెంకట్, బీరయ్య, రాములు, శ్రీను, పోచయ్య, మైపాల్ పాల్గొన్నారు.

## మధుర నెల్సింగ్ మృతికి సంతాపం తెలిపిన ఎమ్మెల్యే

**కంగ్టి, నవంబర్ 13, ప్రభాతవార్త:** మండలంలోని రాజారాం తాండకు చెందిన మధుర నెల్సింగ్ మృతికు గాను ఆదివారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవీందర్ నాయక్, గ్రామస్థులు ఉన్నారు. అదే విధంగా డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి రాజారం తండాకు చెందిన మధుర నెల్సింగ్ అంత్యక్రియలకు హాజరై వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యానిచ్చారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ములుగు, నవంబర్ 13 (ప్రభాతవార్త):** ములుగు మండలం మామిడ్యాల గ్రామానికి చెందిన పల్లె రాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎర్రవల్లి పే బ్యాక్ టు ద సొసైటి అంబేద్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మృతుని భార్య సరితకు రూ.12వేల నగదుతో పాటు 150 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు గీసు మల్లేశం, పరుశురాం, దాసు, దయానంద్, ప్రభాకర్, చిన్న పరశురాం తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలల సమస్యలపై పోరాటం ఆగదు

### టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల రాంచందర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కస్తూర్బా పాఠశాలలోని సమస్యల సాధనకొరకు టిపిటిఎఫ్ మూడు దశల పోరాటం నిర్వహిస్తుందని టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల రాంచందర్ అన్నారు. ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో కొత్త ఉపాధ్యాయుల నియామకం చేపట్టకపోవడం, ఉన్నవారిని బదిలీ చేయడం లేదని, గత మూడేళ్లుగా విద్యార్థీనిలకు నోట్‌పుస్తకాలు, బెడ్‌షీట్లు, వాటర్ హిటీల్‌లు సమకూర్చలేదన్నారు. సమస్యల వలయంలో చిక్కుకున్న కస్తూర్బ విద్యాలయాల వ్యవస్థను పరిరక్షించేందుకు పోరాటం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్ లక్ష్మయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్, నాసర్ పటేల్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, సోషల్ మీడియా కమిటీ సభ్యులు పుండరీకం, మార్పు కళాల మండలి ఎన్నార్, సామెల్, చౌటకూర్ మండల నాయకులు ఆనందం తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై గోడపత్రికను ఆవిష్కరిస్తున్న టిపిటిఎఫ్ జిల్లా నాయకులు



కార్తీక వనభోజనాలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు

**నర్సాపూర్, నవంబర్ 13, ప్రభాతవార్త:** ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాసం పంచమిని పురస్కరించుకుని కార్తీక వనభోజనాలు నిర్వహించారు. నర్సాపూర్ మెదక్ ప్రధాన రహదారిలోని జలహనుమాన్ ఆలయం వద్ద వనభోజనాలు నిర్వహించారు. మొదట శ్రీజలాంజనేయస్వామికి అభిషేకం, పంచామృతాభిషేకం, చందనలేపనం, పూజలు నిర్వాహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌వడ్ల సుధాకర్‌చారి ఈ సందర్బంగా వారికి అన్ని వసతులను కల్పించారు అనంతరం కార్తీక వనబోజనాల సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశ్య సంఘం నాయకుల మాట్లాడుతూ ఐక్యంగా ఉండి ఆర్యవైశ్యుల అభివృద్ధి కృషి చేయవల్సిన అవసరం ఉదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఫైడి శ్రీధర్‌గుప్త, బోర్లెపు శ్రీనివాస్‌గుప్త, ఇమ్మడి శ్రీనపివాస్‌గుప్త, రేఖవెంకటేశం గుప్త, సంతోష్‌గుప్త, కొత్త శ్రీనివాస్‌గుప్త, నోముల శ్రీనివాస్‌గుప్త, భైరస్వామిగుప్త,జూలూరి వెంకటేశ్‌గుప్త, మిర్యాల చంద్రశేఖర్‌గుప్త, ప్రభాకర్‌గుప్త, శ్రీనివాస్‌గుప్త, రమేశ్‌గుప్త, వైకుంఠంగుప్త, నాగేశ్‌గుప్త, శంకర్‌గుప్త, కాశీ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందించిన ఎమ్మెల్యే

**నాగల్‌గిద్ద, నవంబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని ఔదత్‌పూర్ గ్రామానికి చెందిన గాళెప్ప కుటుంబసభ్యులకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి 2లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాళెప్ప కుటుంబ సభ్యులకు చెక్కును అందచేశారు. ఇటీవల గాళెప్ప అనారోగ్యానికి గురికావడంతో కార్పోరేట్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందుకునేందుకు ఎమ్మెల్యే చెక్కును అందించారు. కార్యక్రమంలో సర్పంచులు సంజీవరెడ్డి, సురేఖ రాజ్‌కుమార్, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## హద్నూర్‌లో కొనసాగుతున్న రుద్రాభిషేకం

**న్యాల్‌కల్, నవంబరు 13, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో కొలువదీరిన శివలింగానికి శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని రుద్రాభిషేకం పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రామణ మాసం ప్రారంభం నుంచి కొనసాగుతున్న పూజా కార్యక్రమాల్లో భాగంగా 19వ రోజైన ఆదివారం గుమ్మడి పెంటారెడ్డి, గుమ్మడి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులు అర్చకులు శివమూర్తి స్వామి, సిద్దయ్యస్వామిలు మంత్రాలు వల్లిస్తుండగా రుద్రాభిషేకం పూజలను నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో నిత్య పూజలందుకున్న గణపతి, ఆంజనేయ, నాగదేవత, నవగ్రహా. నంది విగ్రహాలకు పూలమాలలతో అందంగా ముస్తాబు చేశారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అర్చకులు ఆశీర్వచనాలు అందచేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## నారాయణగౌడ్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే

**మనూర్, నవంబరు 13, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఆదివారం ఇటీవల మృతి చెందిన మనూర్ మండలం బాదల్గావ్ గ్రామానికి చెందిన నారాయణగౌడ్ నివాసానికి వెళ్లి అతడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపిపి అధ్యక్షులు కొంగరి మోహన్‌రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విఠల్‌రావు, మాజీ జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు రవీందర్ నాయక్, బెల్లాపూర్ ఎంపిటిసి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ ముజీబ్, గ్రామ సర్పంచ్ నాగప్ప పాటిల్ మాలిపాటిల్, మనూర్ గ్రామ సర్పంచన శివాజీరావు, నాయకులు నాగేందర్, బాబుపాటిల్‌ర, జగదీశ్వర్, మాణెప్ప, శంకర్, విశ్వనాథ్, డీలర్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇర్ఫాని దర్గా ఉత్సవాలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబర్ 13, ప్రభాతవార్త:**



ఉత్సవాలకు ముస్తాబైన ఇర్ఫాని దర్గా

సంగారెడ్డి పట్టణ శివారులోని హజ్రత్ మౌలానా అల్‌హజ హబీబ్ అహ్మద్ బిన్ ఒమర్ అల్యరూఫ్ హబీబ్ ఇర్ఫాన్ అలీ షాబంద నవాజి (ఇర్ఫాని దర్గా) 20వ వార్షికోత్సవ ఉత్సవాలు ఈనెల 14 నుండి రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వహకులు తెలపారు. ఈ ఉత్సవాల కోసం ఇర్ఫాని దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి ఏటా జరిగే ఈ ఉత్సవాలను సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు. సంగారెడ్డి పట్టణంలోని జైల్ మ్యూజియం వద్ద ఉన్న జామియా మసీదు నుండి మొదటిరోజున గంధం ఊరేగింపు ఉంటుందని నిర్వహకులు తెలిపారు. రెండవ రోజున సాంయత్రం దీపారాధాన, కవాలి, అన్నదాన కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమాలకు వివిధ దర్గాల పీఠాధిపతులు హాజరుకానున్నారని, భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఇర్ఫాని దర్గా పీఠాధిపతి హకీమ్ ఉమర్‌బిన్ అహ్మద్ కోరారు. మొదటి రోజు దర్గా ప్రాంగణంలో అఖిలభారత కవి సమ్మేళనం ఉంటుందని ఈ కార్యక్రమంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ కవులు పాల్గొంటారని అన్నారు.

## అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హామీ

**కంగ్టి, నవంబర్ 13, ప్రభాతవార్త:** ఆదివారం నియోజకవర్గమైన నారాయణఖేడ్ స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కంగ్టి మండల ఎంపీపీ సంగీతవెంకట్‌రెడ్డి, కృష్ణ ముదిరాజ్, కంగ్టి సర్పంచ్ నరసమ్మ లతో కలిసి ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి కి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణానికి కృషి చేయమని కోరడం జరిగింది. కోరిన వెంటనే ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ భవన నిర్మాణానికి ఏర్పాటుకు హామీనివ్వడం జరిగింది. కంగ్టి మండల కేంద్రంలో అందరికీ ఉపయోగపడే విధంగా నిర్మాణం చేసుకోవాలని అనడం చాలా హర్షించదగ్గ విషయమని కంగ్టి గ్రామ అంబేద్కర్ యూత్ సభ్యులు, పెద్దలు, గ్రామ ప్రజలు అందరు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవన నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించి, సకాలంలో పూర్తిచేయాలని ఎమ్మెల్యేను వారు కోరడం జరిగింది.



అంబేద్కర్ భవన నిర్మాణం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డికి తెలుపుతున్న ఎంపీపీ, అంబేద్కర్ యూత్ సభ్యులు

# ధాన్యం ఆరబెట్టుకోవడానికి కల్లాలు ఏర్పాటుచేయాలి

### రైతు సంఘం రాష్ట్ర నాయకులు మద్దుల బాల్‌రెడ్డి

**గుమ్మడిదల, నవంబర్ 13, ప్రభాతవార్త:**

ధాన్యం ఎండబెట్టుకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వమే కల్లాలను ఏర్పాటు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నేత మద్దుల బాల్‌రెడ్డిడిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ గుమ్మడిదల మండలంలోని నాలుగు గ్రామాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనధాన్యం ఆరబెట్టుకోవడానికి కల్లాలను ఏర్పాటు చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దృష్టికి గుమ్మడిదల మాజీ రైతు సంఘం అధ్యక్షులు పడమటి లక్ష్మారెడ్డి 6 సంవత్సరాల నుండి రైతులతో పాటు స్వయంగా కలిసి చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని అన్నారు. వడ్లు కొనుగోలు చేసే విధానం ప్రభుత్వం తెలిపిన ప్రకారం 41 కిలో సంచి బరువుతో కలిపి తీసుకోవాల్సింది పోయి 43 కేజీల నుండి 45 కేజీల వరకు తీసుకుంటున్నారని వారు వాపోయారు. రైతు ఆరుగాలం కష్టం చేసి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను మోసం చేసి 5 కిలోల వరకు ధాన్యాన్ని తీసుకుంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని రైతుల వద్ద నుండి ఎక్కువ తీసుకుంటునన ధాన్యాన్ని ప్రభుత్వం చెప్పిన ప్రకారం 41 కిలోలు మాత్రమే తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వరి ధాన్యం ఆరబెట్టుకోవడానికి ప్రధాన రహదారులపై ధాన్యాన్ని పోసుకొని అరపెట్టుకోవాల్సి వస్తుందని కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దయచేసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని గుమ్మడిదల రైతులు కోసం ప్రభుత్వం స్థలాలను గుర్తించి ధాన్యం ఎండబెట్టుకోవడానికి కల్లాలను ఏర్పాటు చేయాలని కోరారు.

## బాలుడి ఆత్మహత్య

**హుస్నాబాద్, నవంబరు 13, ప్రభాతవార్త :** ఉరేసుకుని బాలుడు(12) ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది.ఎస్ఐ సజ్జనపు శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం కంసాని భరత్ చనిపోయిన తల్లి జ్ఞాపకాలను పరిచిపోలేక మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని మేన మామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యప్తు చేస్తున్నట్లు తెలిపారు.